ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర





వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 15 | సంచిక : 01 | సెప్టెంబర్ 2009

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

భీమవరం ............ 15-02-09

తాడినాడ ............ 07-08-09

జిన్నూరు ............ 13-08-09

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 15-02-2009, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం పూజ చేస్తున్నాము, జపం చేస్తున్నాము, ధ్యానం చేస్తున్నాము వీటి యొక్క ప్రయోజనం ఏమిటి అంటే మనస్సుని అదుపులో పెట్టుకోవటానికి, మనస్సుని నిగ్రహించుకోవటానికి ఇవన్నీ మనం చేస్తున్నాము. మనస్సుని ఒకేసారి కంట్రోలు చేసుకోవటం చాలాకష్టం. మనస్సును నిగ్రహించటం చాలా కష్టమే కాని దానికి రెండు ఉపాయాలు ఉన్నాయి. 1. అభ్యాసము, 2. వైరాగ్యము అని పరమాత్మ చెప్పాడు. మనిషి అయ్యాక ఎంతోకొంత వైరాగ్యం ఉండాలి ఎంతోకొంత వైరాగ్యము ఉన్నవారే సమాజానికి ఉపయోగపడగలరు కాని వైరాగ్యము లేకపోతే సమాజానికి ఉపయోగపడలేరు. ఈ ప్రపంచంలో మనల్ని సుఖపెట్టే వస్తువు ఒక్కటీ లేదు. సుఖం అనేది బయటలేదు. నిజమైనసుఖం మన హృదయంలో ఉంది, శాంతి మన హృదయంలో ఉంది. అది మనకు అనుభవంలోనికి రావాలి. అది అనుభవంలోనికి రావాలంటే అద్వైతానుభవం ఉండాలి. అద్వైతానుభవం లేకుండా ఆత్మానందం రాదు.

హృదయంలో ఉన్న సుఖం ఎలా అందుతుందో స్వామివారు గీతలో చెప్పారు. దానికి ముందు ఆహారశుద్ధి చెప్పాడు. మనం తిండి దగ్గర చాలా జాగ్రత్తగా ఉండాలి. శాస్త్రానికి అనుగుణంగా మన ప్రవర్తన ఉండాలి. మన మనస్సు చెప్పినట్టు వినకుండా భగవంతుడు చెప్పినట్టు చేయాలి. మనకి ఆహారశుద్ధి, ఇంద్రియశుద్ధి, ప్రవర్తనలో శుద్ధి లేకుండా

మనం ఎంత ప్రయత్నం చేసినా అంతఃకరణశుద్ధి రాదు. అంతఃకరణశుద్ధి లేకుండా ఈ సృష్టిలో ఇప్పటివరకూ ఎవరికీ ఆత్మజ్ఞానం కలగలేదు. ఆహారశుద్ధి, ఇంద్రియశుద్ధి, ప్రవర్తనలో శుద్ధి ఇవన్నీ అయిన తరువాత అంతఃకరణశుద్ధి వస్తుంది. అంతఃకరణశుద్ధి వచ్చిన తరువాత ఆత్మజ్ఞానం కలుగుతుంది. భగవంతుడు లేడని కొంతమంది అంటున్నారు, భగవంతుడు ఉన్నాడని కొంతమంది అంటున్నారు. నాకు ఎటువెళ్ళాలో తెలియటం లేదు అని ఒకరు కంచిపరమాచార్యులని అడిగారు. భగవంతుడు లేడని చెప్పేవారితోటి కలిసి తిరిగితే నువ్వు స్లోగా పాడైపోతావు. భగవంతుడు ఉన్నాడని చెప్పేవారితోటి సహవాసం చేస్తే వారి వైబ్రేషన్స్ నీకు పని చేస్తాయి, నువ్వు తరిస్తావు. అందుచేత భగవంతుడు ఉన్నాడని చెప్పేవారితోటి నువ్వు సహవాసం చెయ్యి, భగవంతుడు లేడని చెప్పేవారితోటి నువ్వు సహనాసం చెయ్యవద్దు అని పరమాచార్యులు చెప్పారు.

మనకి భగవద్గీత ప్రమాణము. పరమాత్మ గీతలో ఏమని చెప్పాడు అంటే నీకు రూపబుద్ధిపోలేదు, నామబుద్ధిపోలేదు కాని అసలు వస్తువుకి రూపం లేదు, నామం లేదు. లోపల సద్వస్తువు నిర్గుణం, నిరాకారం నువ్వు అక్కడికి చేరుకోవాలి ఆ నిర్గుణాన్ని, నిరాకారాన్ని నువ్వు ఆరాధించలేవు. నువ్వు నిర్గుణాన్ని, నిరాకారాన్ని ఆరాధించటం ఎటువంటిది అంటే గోదావరిని మనం ఈదటంలాంటిది. ఈదేవాడు మధ్యలో మునిగిపోవచ్చు. నువ్వు సాధనలో ముందు సాకారాన్నే పెట్టుకో. సాకారాన్ని పెట్టుకుంటే నావమీద ప్రయాణంలాంటిది. నావమీద కూర్చుంటే నది దాటించేస్తాడు. సగుణం అటువంటిది. మన ఇంద్రియాలకి అతీతంగా ఏమీలేదు, మన ఇంద్రియాలకి తెలిసేదే నిజం అని ఇలా అనుకునేవారు నిరాకారాన్ని, నిర్గుణాన్ని పట్టుకోలేరు. అందుచేత సాకారాన్ని, సగుణాన్ని పట్టుకుని సిన్సియర్‌గా సాధన చేస్తూ ఉంటే తరువాత ఈశ్వరుడు మీకు ఏమిచెయ్యాలో అది చేస్తాడు. సద్వస్తువు మన హృదయంలో ఉంది. దానిని మన మనస్సు అందుకోలేదు, మన బుద్ధి అందుకోలేదు, మన ఇంద్రియాలు అందుకోలేవు. అందుకోలేకుండా అది నేనై ఉన్నాను, అది నేనై ఉన్నాను అంటే చివరికి నువ్వు పాడైపోతావు, నీపతనం ప్రారంభమవుతుంది. అందుచేత ఎవరికైనా ఆధ్యాత్మికంగా సలహా చెప్పేటప్పుడు గురువు ఏమి చెయ్యాలంటే ముందువారు ఏ స్థాయిలో ఉన్నారు, మనం ఎలా చెబితే వారికి అర్థం అవుతుంది, ఎలా చెబితే తరువాత మెట్టుకి వెడతారు ఇవన్నీ బాగా ఆలోచించి చెప్పాలి. వారికి ఉన్న బలహీనతలు ఏమిటి, ఆ బలహీనతలలోనుండి వారిని ఎలా విడుదల చెయ్యాలి అని ఇవన్నీ చూసుకుని చెబుతాడు. వాడు గురువు. కొంతమంది

గురువులు ఏమి చేస్తారంటే ఆయన చెప్పేమాటలు మీరు వినకపోయినా ఏవో మాటలు చెపుతూ మీరు పరాగ్గా ఉండగా నోట్లో పోసేస్తారు అటువంటి గొప్ప గురువులు ఉన్నారు.

మనం ఈ జన్మలో చేయవలసిన కర్తవ్యం ఏమిటి అంటే మనం పుణ్యాన్ని పోగుచేసుకున్నా జన్మ వస్తుంది, పాపాన్ని పోగుచేసుకున్నా జన్మవస్తుంది. మనకి ఆత్మజ్ఞానం కావాలంటే మన రూపం, మన నామం ఎంత తొందరగా మరచిపోతే అంతవేగంగా భగవంతుడు మిమ్మల్ని జ్ఞానంతోటి అనుగ్రహిస్తాడు, భక్తి, వైరాగ్యాలతోటి అనుగ్రహిస్తాడు. నీకు రూపబుద్ధి, నామబుద్ధి పోకుండా నువ్వు లోపలికి ఎలా వెళతావు? లోపలికి వెళ్ళటానికి నీకు అసలు తూకం లేదు. బరువు ఏమీ లేదు కానీ ఉందని అనుకుంటున్నావు. అది ఆత్మ వంచన. మనం సాధన చేసేటప్పుడు మనం ఏ స్థాయిలో ఉన్నాము, ఇక్కడినుంచి ఎదరకి ఎలాగ వెళ్ళాలి అని మనలో మనం ఆలోచించుకుని, మన మైనస్ పాయింట్స్ ఏమిటి? మన ప్లెస్ పాయింట్స్ ఏమిటి? ఏ వాసన వల్ల మనం లోకంచేత బంధింపబడుతున్నాము ఇవన్నీ కూడా మనం విచారణ చేసుకోవాలి. మనం అందరం డ్యూటీ చెద్దాము కానీ ఏదీ ఆశించవద్దు. పుణ్యం బంగారపు సంకెళ్ళు, పాపము ఇనుప సంకెళ్ళు. అదీ బంధిస్తుంది, ఇదీ బంధిస్తుంది. అందుచేత మీరు ఏ పని చేసినా ఈశ్వరార్పణంగా చెయ్యాలి. ఈశ్వరార్పణంగా చేస్తే మనకి ఈశ్వరుని దయ కలుగుతుంది. ఈశ్వరుని దయ కలిగితే అన్నీ మన చేతిలో ఉన్నట్టే, మనం అంతా పొందినట్టే.

పుట్టినప్పుడు అందరూ పాపంమూటో, పుణ్యంమూటో వేసుకుని వస్తున్నారు. ఇంక మీరు పాప, పుణ్యాల మాట వదిలేయండి. మీరు మూటలు మోసుకువచ్చి ఆ మూటల్లో ఇంకా బరువు వేసేసుకుంటున్నారు. అందుచేత భగవంతుడు గీతలో ఏమని చెప్పాడంటే మీరు పుణ్యం మూట తెచ్చుకున్నారు అనుకోండి ఆ పుణ్యం ఇక్కడే వంచేయండి, మీరు పాపం మూట తెచ్చుకున్నారు అనుకోండి ఆ మూటలో పాపం కూడా ఇక్కడ వంచేయండి. అది ఎలా వంచాలో నేర్చుకోండి. అది ఆత్మవిద్య అన్నాడు. మీరు మూటలు ఇక్కడ వంచకుండా పుణ్యం మూట తెచ్చుకుంటే మళ్ళీ దాంట్లో పుణ్యం పెంచేసుకుని, పాపం మూట తెచ్చుకుంటే ఇంకా దానిలో పాపం పెంచేసుకొని కొత్తజన్మలోకి వెడుతున్నారు. ఇంక మీకు జన్మరాహిత్యస్థితి ఎలా వస్తుంది? మూటలు విప్పండి విప్పి అందులో ఉన్నది ఏదో కింద పడేయండి. దాని వలన మీకు మోక్షం వస్తుందని తెలియక, నారాయణుడి యొక్క స్వరూపం మీకు వస్తుందని తెలియక మూటలు విప్పలేకపోతున్నారు, కింద పడేయలేకపోతున్నారు. మూటలు విప్పండి. అదే మీరు చేసే సాధన.

మీరు పుణ్యపాపాలు ఇక్కడ వదిలించుకుంటే మీకు అమృతస్థితి కలుగుతుంది.

తపస్సు అంటే ముక్కు మూసుకోవటం, మీ శరీరాన్ని శుష్కింపచేయటం తపస్సుకాదు. తపస్సు అంటే మీ దేహప్రారబ్దంలో ఏదైనా కష్టం వస్తే అంటే మీ ఇంట్లో మిమ్మల్ని మాటలు అంటున్నారు అనుకోండి, గాలివానల వలన ఇబ్బందులు వస్తున్నాయి అనుకోండి, ఏదైనా పంటలకు నష్టం వస్తోంది అనుకోండి ఏ రకమైన కష్టం వచ్చినా, ఆ కష్టాన్ని, ఆ నష్టాన్ని నువ్వు సహించుకోగలిగితే దానికి మించిన తపస్సు లేదు అని శాస్త్రంలో చెప్పాడు. తుకారామ్ గయ్యాళి భార్యతోటి కాపురం చేసాడు. తుకారామ్ భార్య కొట్టేది. భార్య కొడితే తుకారామ్‌ని పిల్లలు కూడా కొట్టేసేవారు. తుకారామ్ ఎక్కడికో హిమాలయ పర్వతాలలోకి పారిపోలేదు. ఇంట్లోవారు పెట్టిన బాధలు, సమాజపరంగా వచ్చిన బాధలు, ప్రకృతిరీత్యా వచ్చిన బాధలు ఏది వచ్చినా ఇష్టంతోటి సహించాడు. ఆ సహించటంకంటే మించిన తపస్సు ఏమైనా ఉందా? అలా సహించాడు కాబట్టి తుకారామ్‌కి వైకుంఠంలోకి వెళ్ళటానికి విమానం పంపారు. మనం చచ్చాక చివరకు నరకానికి వెళతాము. మీకు ఏమైనా ఇబ్బందులు వస్తే ఆ ఇబ్బందుల్ని ఎంతవరకూ మీరు సహించకలుగుతున్నారు, మీరు సహించకలిగితే అది కూడా తపస్సే. సహించగలగాలి, సహనం ఉండాలి. సహనం మనకు ఎవరికీ లేదు. సహనం లేకుండా ఆత్మజ్ఞానాన్ని ఎలా ఆశిస్తావు? మీకు సహనం లేకపోతే లోతులు పెరగవు. మీ హృదయం యొక్క లోతులు పెరగకపోతే మీకు జ్ఞానం రాదు.

మీరు ఇతరులకు ఏదైనా సహాయం చేయగలిగితే చెయ్యండి. భగవంతుడు మీకు ఏ గిఫ్ట్ అయితే ఇచ్చాడో అవి మీతోటివారికి ఉపయోగించండి. ఇతరుల క్షేమం కోసం ఎంతోకొంత కృషిచేయండి, మాట సహాయం చేయండి, ద్రవ్య సహాయం చేయండి, మీకు ఏది అయినా పలుకుబడి ఉంటే ఆ పలుకుబడి పదిమందికి ఉపయోగించండి. నీకు జపం ఏ ఫలితం ఇస్తుందో, ధ్యానం ఏ ఫలితం ఇస్తుందో ఇది కూడా అంతే ఫలితం ఇస్తుంది. నీకు ఏమైనా అవకాశాలు ఉంటే ఇతరులకి చేతనైనంత వరకు సహాయం చెయ్యి, నిన్ను భగవంతుడు కరుణిస్తాడు. ఈ సృష్టిలో మనది అంటూ ఏమీ లేదు. మనకి దేహభావన ఉంది కాబట్టి మనది అనుకుంటున్నాము. నీకు ఎవరు ఇచ్చారు? దేవుడు ఇచ్చాడు. మళ్ళీ ఇచ్చేటప్పుడు కూడా దేవుడు అనుకునే ఇవ్వాలి. గుడిలో హారతి పళ్ళెంలో నువ్వు పది పైసలు ఏ భావనతోటి వేస్తున్నావో ఆ భావనతోటే సృష్టికి కూడా చెయ్యి. దేవుడే ఈ ప్రపంచ రూపంలో

కనిపిస్తున్నాడు. అందుచేత నువ్వు ప్రపంచంలో ఏది చేసినా దైవపూజే. కొంతమంది ఎప్పుడు చనిపోదామా అనుకుంటారు, డబ్బున్నవాళ్ళే ఎక్కువగా అలా అనుకుంటారు వారికేవో బాధలు ఉంటాయి. భగవంతుడు ఇంక ఎన్ని రోజులు ఉంచుతాడు, చనిపోతే బాగుండును అని అనుకుంటూ ఉంటారు. వారికి ప్రపంచం చేదుగా కనిపిస్తోంది. మీరు అలాగ అనుకోనక్కరలేదు. ఈ ప్రపంచం అంతా ఈశ్వరుడి స్వరూపమే అని మీకు అనుభవం కనుక వస్తే ఈ ప్రపంచం చేదుగా ఉండదు, పుల్లగా ఉండదు. చాలా తియ్యగా ఉంటుంది. ఎంత తియ్యగా ఉంటుంది అంటే మీకు వైకుంఠంలో కూడా ఆ సుఖాన్ని పొందలేరు. అప్పడు ఏమనుకుంటారంటే ఈ ప్రపంచంలో చిరకాలం ఉండాలనుకోరు వెళ్ళిపోవాలని అనుకోరు. అంతర్యామిగా ఉన్నటువంటి ఈశ్వరుడు మీకు అనుభవంలోనికి వచ్చినప్పడు ఇదంతా ఈశ్వరస్వరూపంగానే మీకు కనిపిస్తుంది. నీ లోపల ఎవడు ఉన్నాడో వాడే బయట అంతటా వ్యాపించి ఉన్నాడు అనేటువంటి విషయం మీకు అనుభవంలోనికి వచ్చినప్పడు ఈలోకం చాలాతియ్యగా ఉంటుంది.

మీరు చేసే మంచి కార్యక్రమం వల్ల మీ మనస్సు పెరగకూడదు, మీరు బాగుపడాలి. మనం మాట్లాడేమాట వలన, మనం చేసేపని వలన మనకి అంతఃకరణ శుద్ధి రావాలి. మనకి లోపల ఒక ఆలోచన ఉంటుంది, నోటితో వేరొకటి చెబుతాము. ఇలా చేస్తూ ఇతరులను మాయ చేస్తున్నాము అనుకుంటున్నాము కాని మనలను మనం మాయ చేసుకుంటున్నాము, మనకి మనమే అపకారం చేసుకొంటున్నాము అనే బుద్ధి కూడా మనకి రావటంలేదు. రామకృష్ణుడిని ఎవరైనా పరీక్షపెట్టటానికి వస్తే ఏమిటి నన్ను పరీక్ష పెట్టటానికి వచ్చారు అని అనుకునేవాడుకాదు. అమ్మా నన్ను ఇంకా పరిశుద్ధుడను చేయటానికి ఈ పరీక్ష పెట్టేవాళ్ళని పంపిస్తున్నావా నువ్వు, లేకపోతే వీరిని ఎందుకు పంపిస్తావు అమ్మా అనేవాడు. అంటే పరిపూర్ణ శరణాగతి. రామకృష్ణుడికి సంకల్పమంటూ లేదు, వికల్పమంటూ లేదు. భగవంతుడు ఇష్టమే ఈయన ఇష్టం, ఆయన సంకల్పమే ఈయన సంకల్పం. రామకృష్ణుడిలో నేను అనే తలంపు వెదికినా కనబడదు. ఆయన నిష్కపటి. ఆయనకు అన్నం లేదు అనుకోండి, అన్నంలేదు ఆకలి వేస్తోంది అని అడగడు, తిండిలేకుండా వీడు బాధపడుతున్నాడు అని అనుకుంటారేమో అని కూడా ఆయనకు ఉండదు, అంతకపటంలేని మనిషి.

సూర్యుడు వెలుతురుని ఇస్తాడు. మబ్బు అడ్డువచ్చింది అనుకోండి, ఆ మబ్బు మనకి వెలుతురు రానివ్వదు. అలాగే మీలో చాలామంది మంచివారు ఉన్నారు. మీరు పూర్వజన్మలలో

చేసుకున్న కర్మల్లోంచి వచ్చిన దోషాలు మిమ్మల్ని పీడిస్తూ ఉంటాయి, మన లోపల జ్ఞాన సూర్యుడు ఉన్నప్పటికీ ఆయన మనకు కనబడకుండా చేస్తాయి. అప్పుడు మనం కంగారు పడకూడదు, మనం సాధన చెయ్యగా, చెయ్యగా, ఈశ్వరుడి మీద ప్రేమ పెంచుకుంటూ, ప్రీతి పెంచుకుంటూ ఉంటే నీ ఇష్టమే నా ఇష్టం అనే సంకల్పాన్ని పెంచుకోగా, పెంచుకోగా మేఘం తప్పుకున్నవెంటనే సూర్యుడు మనకి ఎలా గోచరిస్తాడో అలాగే ఏదోరోజున మీ దోషాలు తప్పుకుంటాయి, మీ ప్రారబ్దం తప్పుకుంటుంది. మీ లోపల ఉన్న జ్ఞానసూర్యుడు మీకు గోచరిస్తాడు. ఏమిటి మనకి ఇంకా జ్ఞానం రావటంలేదు, ఆత్మసుఖం అందటంలేదు అని తొందరపడకండి. పూర్వకర్మల్లోంచి వచ్చిన దోషాలు కొంతకాలం పీడిస్తాయి, పీడించిన తరువాతపోతాయి. అవి పోయిన తరువాత నిజస్వరూపం మీకు వ్యక్తమవుతుంది. ఈలోపు మనం సహనంగా ఉండాలి. మన ప్రయత్నం మనం జాగ్రత్తగా చేసుకొంటూవెళ్ళాలి, తరువాత కాలం కలిసిరావాలి, వీటితోపాటు ఈశ్వరానుగ్రహం ఉండాలి. ధ్యాన నిష్ట, ఆత్మనిష్టబాగా నిలబడటానికి మనం సత్‌కర్మ చెయ్యాలి. ఏదీ ఆశించకూడదు. మీరు మంచికర్మలు చేసి గౌరవం రావాలంటే గౌరవం వస్తుంది కానీ ధ్యాననిష్ట, ఆత్మనిష్ట రాదు. ఆత్మనిష్ట లేకుండా మీకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. ఆత్మజ్ఞానం లేకుండా ఆత్మసుఖం ఎలా తెలుస్తుంది.

అద్దం మసిపడితే అద్దంలో మన ముఖం సరిగ్గా కనబడదు. అద్దం బాగా శుభ్రం చేస్తే అప్పుడు అద్దంలో మన ప్రతిబింబం చాలాచక్కగా కనిపిస్తుంది. అలాగే నీ మనస్సు అనే అద్దాన్ని బాగా స్వచ్ఛంగా చేసుకో, బాగా నిర్మలంగా చేసుకో. మనస్సు అనే అద్దం స్వచ్ఛంగా ఉంటే లోపల ఉన్న సద్వస్తువు నీకు ఎంతో స్పష్టంగా గోచరిస్తుంది. సాధన దేనికోసం? మనస్సుని బాగుచేసుకోవటానికే సాధన. లోపల ఉన్న ఆనందం మనకి అందటంలేదు అంటే మనస్సులో ఎక్కడో తేడా ఉంది. మనస్సులో ఉన్న తేడాని తొలగించుకుంటే లోపల ఉన్న ఆనందం అందుతుంది. మీ మనస్సు అనేది ఒక అవకరం. మనోనాశనం అయ్యేవరకూ లోపల మీకు ఆనందం ఉన్నా అందదు. మనోనాశనం చేసుకోలేక, మనస్సుని వాసనాక్షయం చెయ్యలేక లోపల ఆనందమే లేదు, లోపల భగవంతుడు లేడు అని అనుకుంటున్నావు. మనస్సు అనే అవకరంపోతే లోపల ఉన్నటువంటి జ్ఞానగంగ వెంటనే మన సహస్రారానికి అందుతుంది. అప్పుడు లోపల ఉన్న సుఖం మనకు అందుతుంది. ఏ లౌకికసుఖం ఈ సుఖంతోటి సమానంకాదని, ఏ ఇంద్రియసుఖం ఈ సుఖంతోటి

సమానంకాదని పైగా అది స్వచ్ఛమైనది అని అప్పడు మనకి అనుభవంలోనికి వస్తుంది. మనల్ని ఏ వాసన పీడిస్తోంది, ఏ కోరిక మనల్ని పీడిస్తోంది, ఏ తలంపు వల్ల మనం లోకానికి బంధింపబడుతున్నాము అని జాగ్రత్తగా మనల్ని మనం విశ్లేషణ చేసుకోవాలి. అది చూసుకుని ఆ వాసనతోటి మనకి వియోగం కావాలి. ఆ వాసనను స్లోగా, స్టడీగా వదిలించుకోవాలి. వాసన బలీయంగా ఉన్నప్పడు దానిని బయటకి గెంటలేము అనిపిస్తుంది. దేహగతమైననేనుని బయటకి గెంటికాల్చి బూడిద చేస్తేనేగాని నీకు ఆత్మజ్ఞానం కలుగదు.

నువ్వు ఒక విషయం మరచిపోకు. నువ్వు పుట్టింది మొదలు చనిపోయేవరకు ఏ పని చేసినా నేను కోసమే చేస్తావు. మీ లోపల ఉన్న నేనుకి ఎవరైనా అపకారం చేసారనుకోండి వాడిని వదిలేస్తారు. మీ ఇంట్లో వారు అనుకూలంగా లేరు అనుకోండి, వారికి మానసికంగా దూరమైపోతారు. దీని అర్థం ఏమిటి అంటే ఆ మనిషి పుట్టినా, జీవించినా, ఆ మనిషి ఏ పని చేసినా ఆ నేను కోసమే చేస్తాడు. ఆ నేనుని ఊడగొట్టుకునేవరకూ వాడు జ్ఞానానికి అర్హుడుకాదు, వాడికి జ్ఞానానికి యోగ్యత రాదు. ఆ నేను అనేది నిజంగా లేనేలేదు కానీ నువ్వు ఉందని అనుకుంటున్నావు. లేని నేనుని లేదని తెలుసుకోవటమే జ్ఞానం. రామకృష్ణ పరమహంసగారు ఏమి చెప్పారు అంటే కాలువలో నీరు వెడుతూ ఉంటే ఒక కట్టను ఆ నీటిలో వెయ్యమన్నారు. ఆ కట్ట కాలువలో వెడుతూ ఉంటే మనకి ఏమనిపిస్తుందంటే కట్టకు ఆ పక్క నీరు వేరు, ఈ పక్క నీరు వేరు అనిపిస్తుంది. కాని నీరు అంతా ఒక్కటే. అలాగే మొత్తం అంతా ఒకటే అయినా మనస్సు ఉండటం వలన వారు వేరు, నేను వేరు అనే బేధబుద్ధిని నీ మనస్సు తీసుకువస్తోంది, నువ్వు ఏ సాధన చేసినా ఆ మనస్సుని తొలగించుకోవటానికే ప్రయత్నం. ఈ లోపులో మహిమలు గొడవల్లోకి వెళ్ళకు. మహిమల గొడవల్లోకి వెడితే నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. మనస్సు ఏ కారణం వలన బాహ్యముఖానికి వస్తోందో ఆ కారణాన్ని కత్తిరించటమే సాధన యొక్క గమ్యం. భగవంతుడు చెప్పిన మాటని ప్రమాణంగా తీసుకుంటే మనం బాగుపడతాము. శాస్త్రం చెప్పినట్టు మనం నడిస్తే మనకి తెలియకుండానే మనోనాశనం అవుతుంది.

మంచివాళ్లకే ఎక్కువ కష్టాలు వస్తున్నాయి ఏమిటి అని కొంతమంది అంటారు. ఎందుకు ఎక్కువ కష్టాలు వస్తాయి అంటే భగవంతుడికి ఎవరిమీద అయితే అనుగ్రహం కలిగిందో, భగవంతుడి దయ అనే వర్షం ఎవరి శిరస్సుమీద అయితే వర్షిస్తుందో అప్పడు భగవంతుడు ఏమి చేస్తాడు అంటే రాబోయే వెయ్యి జన్మల్లో అనుభవించవలసినటువంటి

కర్మని ఒకే జన్మలో అనుభవింపచేసి వాటిని తీసేసి మీకు మోక్షాన్ని ఇస్తాడు. మానవుడికి అసాధ్యం ఉందికాని, భగవంతుడికి అసాధ్యం అంటూ ఏమీలేదు, ఆయనకు అన్నీ సాధ్యమే. మీరు మాట్లాడుతున్నారు అనుకోండి ఆ మాట హార్ట్‌ఫుల్‌గా మాట్లాడుతున్నారా, ఊరికే నటనకోసం మాట్లాడుతున్నారా అనేది తెలుస్తూ ఉంటుంది. ఆ మాటకి తూకం ఎప్పడు వస్తుంది అంటే మీ హృదయంలో ఉన్న ఈశ్వరుడిని టచ్ చేసి ఆ మాట కనుక వస్తూ ఉంటే ఆ మాట మీకు లోచూపు కలుగజేస్తుంది. మాట దేవుడై ఉంది. నీ లోపల ఏదైతే ఉందో అది అయ్యి నువ్వు చెబుతూ ఉంటే ఆ మాట కూడా దేవుడితోటి సమానం.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-08-2009, తాడినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీ ప్రారబ్దాన్ని బట్టి భగవంతుడు మీకు ఏ పని అయితే కేటాయించాడో ఆ పనిని నువ్వు శ్రద్ధగా, భక్తిగా చేయటమే ఆయనకు పెట్టే నిజమైన నమస్కారము. కర్మ సన్యాసం కంటే కర్మయోగం మంచిది అని భగవంతుడు చెప్పాడు. బద్ధకస్తులకు వారి శరీరయాత్ర నడవటంకూడా కష్టమవుతుంది. స్వయంకృషి ఉండాలి, దేవుని కృప ఉండాలి. మీరు ఏదైనా విషయంలో అభివృద్ధిలోనికి వస్తే అదంతా మీ తెలివిఅనుకోకూడదు. మీ ప్రయత్నం మీరు చేసారు, భగవంతుడు అనుగ్రహించాడు. మనకంటే కష్టపడేవారు ఉన్నారు, ఒకోసారి వారికి కలిసిరాకపోవచ్చు. దానికి ఈశ్వరునిదయ ఉండాలి. ఈశ్వరనిర్ణయం ఎలా ఉంటుందో మనం చెప్పలేము. మీ అనుగ్రహం కావాలి అని అమలాపురంలో ఒకరు అడిగారు. మా అనుగ్రహం ఏమిటండీ, అహంకారం ఏమి అనుగ్రహిస్తుంది, జ్ఞానం అనుగ్రహించాలి అని చెప్పాను. గ్రహంఅనే మాటకు పట్టుకోవటం అనిఅర్థం. సర్వకాలసర్వావస్థలలో ఈశ్వరుని పాదాలను ఎవడైతే పట్టుకొని వేలాడుతున్నాడో వాడికి ఆయన అనుగ్రహం వస్తుంది. మీరు ఈశ్వరుని అంటిపెట్టుకొని ఉండండి, ఆయన ఏదో టైములో మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. మీరు చేసిన కృషి ఊరికేపోదు. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి పెట్టుబడి ఏమిటి అంటే పవిత్రత ఉండాలి. నామాన్ని శ్రద్ధగా చేయటంవలన మన మనస్సు పవిత్రం అవుతుంది. బాహ్యంగా మనకు ఎన్ని సదుపాయాలు ఉన్నా పవిత్రుడు కానివాడికి ఆత్మజ్ఞానం కలుగదు.

మీరు భగవద్గీత చదివితే సరిపోదు, మీ ప్రవర్తన నాకు సమ్మతంగా ఉంటేనే నా అనుగ్రహం మీకు వస్తుంది అని పరమాత్మ చెప్పాడు. మీ నెత్తిమీద మీరే అక్షింతలు వేసుకొని